## క్లుప్తంగా

### చదువుపై శ్రద్ధ అవసరం



తాడూరు: చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని.. ఎట్టి పరిస్థితుల్లోనూ చదువుపై అశ్రద్ధ చేయొద్దని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని యాదిరెడ్డిపల్లి పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులతో పాటు విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలని తెలిపారు. చదువులో రాణించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. సమాజంలో మంచి చెడులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కాగా, పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వేరుశనగ క్వింటా రూ.7,090

కల్వకుర్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగ క్వింటాకు గరిష్ఠంగా రూ.7,090, కనిష్ఠంగా రూ.4,001, సగటున రూ.6,811 ధరలు వచ్చాయి. మొత్తం 148 మంది రైతులు 4,675 బస్తాలలో 1,402 క్వింటాళ్ల వేరుశనగను మార్కెట్‌లో అమ్మకానికి తీసుకొచ్చినట్లు కార్యదర్శి భగవంత్ తెలిపారు.

### మార్మోగిన శివనామస్మరణ



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన శివమాలధారులు గురువారం ఇరుముడి కట్టుకున్నారు. అనంతరం స్వాములు శ్రీశైలంలో మల్లికార్జునస్వామి దర్శనానికి బయలుదేరారు. ఈ సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

### సర్వే డబ్బులు ఇవ్వండి

నాగర్‌కర్నూల్‌రూరల్: గతంలో లెప్రసి సర్వేకు సంబంధించిన డబ్బులు వెంటనే ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు శకుంతల డిమాండ్ చేశారు. గురువారం పెద్దముద్దునూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలోనే చేసిన సర్వేకు డబ్బులు ఇవ్వకుండా మళ్లీ లెప్రసీ సర్వే చేయాలని ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రకళ, శోభ, వరలక్ష్మి, మానస, గౌరమ్మ, నాగలక్ష్మి, రేణుక, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక టిప్పర్లను అడ్డగించిన గ్రామస్తులు

ఉప్పునుంతల: దుందుబీ వాగు నుంచి ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లను గురువారం మధ్యాహ్నం మండల కేంద్రంలో గ్రామస్తులు అడ్డగించారు. వారం రోజులుగా విచ్చలవిడిగా ఇసుక తరలిస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ పనుల పేరిట అనుమతులు పొంది ఇష్టానుసారంగా ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తున్నారని వారు విమర్శించారు. రెవెన్యూ అధికారులు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం దీనికి తోడు పోలీసులు పరోక్షంగా సహకరించడంతో అక్రమార్కులు ఇసుక వ్యాపారానికి తెరలేపారని ఆరోపించారు. తరుచుగా ఇసుక టిప్పర్లు గ్రామం నుంచి వెళ్లడంతో రోడ్లు దెబ్బతిన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

### భక్తిభావంతో మెలగాలి

కల్వకుర్తిరూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలని నాగర్‌కర్నూల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు అన్నారు. గురువారం వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్మిచర్ల రమేష్, శ్రీధర్, చంద్రమౌళి, భక్తులు పాల్గొన్నారు.

### రథోత్సవానికి ఏర్పాట్లు

ఉప్పునుంతల: స్థానిక కేదారేశ్వరాలయంలో నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలు పురస్కరించుకొని రథోత్సవం, జాతర నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం నూతనంగా రథం(తేరు)ను తయారు చేసే పనులకు గ్రామస్తులు పూజలు నిర్వహించారు. దాదాపుగా రూ. 7 లక్షల వరకు వ్యయం అవుతుందని దాతలు ముందుకు రావాలని గ్రామస్తులు కోరారు. ఎద్దుల బండలాగుడు పోటీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు కొత్త జంగిరెడ్డి, సూరం వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామస్తులు భాగస్వాములు కావాలని కోరారు.

### పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

అమ్రాబాద్: మండలంలోని మాధవానిపల్లిలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేసినట్లు పశువైద్యాధికారి అనీల్‌కుమార్ తెలిపారు. మొత్తం 307 ఆవులు, 67 గేదెలకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు.



వెల్దండలో ..



పెంట్లవెల్లిలో..



పెద్దకొత్తపల్లిలో..



తెలకపల్లిలో..



మన్ననూర్‌లో.. .

# ఘనంగా మహిళా దినోత్సవం

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలల, ఆవోపా ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించారు. పురుషులతో సమానంగా ఆడపిల్లలను పెంచాలని వక్తలు పేర్కొన్నారు. రెయిన్‌బో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరంగం శిరీషాణి, కరస్పాండెంట్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి బహుమతులను అందజేశారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భారతమ్మ, ఏపీఎం రాములు, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ రాములు, రాజేష్, శశిధర్‌రెడ్డి, సీసీలు రవి, రాములయ్య, గిరి, గెల్వమ్మ, కిష్టమ్మ, పాండు, అరుణ్, వీఓఏలు తదితరులు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో మహిళా మండలి సమైక్య, ఏపీజీవీబీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీఓ ప్రసన్నకుమారి బహుమతుల ప్రదానం చేశారు. ఏపీఎం గౌస్‌ద్దీన్, బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్‌రెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు, సీసీలు తదితర మహిళలు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యూసూఫ్‌అలీ, గిర్దావరి ఆర్‌ఐ వెంకటేష్, ఏపీఎం అరుణ, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మండల మహిళ సమైక్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ కృష్ణయ్య, ఎస్‌ఐ రామేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. మహిళలను సన్మానించారు. ఏపీఎం నిరంజన్, మహిళా సమైక్య కార్యదర్శి అమృత,బ్యాంక్ మేనేజర్ శరవన్‌కుమార్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రాజా, మల్లేష్ పాల్గొన్నారు.

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల కేంద్రంలో మహిళా కార్మికులను ఎక్సైజ్ ఎస్‌ఐ బాలీశ్వరీ, డిపో ఏఎస్‌ఓ విజయలక్ష్మిలు సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.

మన్ననూర్: గ్రామంతో పాటు వెంకటేశ్వర్లబావి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. అధ్యాపకులు వెంకటయ్య, కొర్ర ఈశ్వర్‌లాల్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో మహిళలను సన్మానిస్తున్న ఆవోపా సభ్యులు



బల్మూర్ మండలం కొండనాగుల డిగ్రీ కళాశాలలో..



తిమ్మాజిపేటలో ..

### ఆయాగా పనిచేస్తూ.. అన్నీ తానై

అచ్చంపేట రూరల్: ప్రతి మగాడి విజయం వెనుక ఆడది ఉంటుందంటారు. అవును.. ఆమె లేకపోతే మగాడే లేడు. అంతెందుకు ఈ సృష్టే లేదు. ఆమె పోషించని పాత్రేదైనా ఉందా? అంటే చెప్పడం కష్టమే. ప్రతి ఇంట్లో ఆమె లేనిదే పూట గడవదు. ఏ పని సాగదు. ఏ ప్రతిఫలం ఆశించని అమ్మలా, ఇల్లాలిగా.. పాత్ర ఏదైతేనేం సమర్థంగా పోషిస్తూ, ఎవరూ భర్తీ చేయలేని విధంగా ముందుకు సాగే స్త్రీమూర్తి సేవలను ఏమని కీర్తించగలం. అలాంటి కోవకు చెందింది చెన్నోజు లక్ష్మమ్మ. నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లికి చెందిన చెన్నోజు వెంకటాచారితో 1972లో లక్ష్మమ్మకు వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడే భర్త వెంకటాచారి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి అన్నీ తానై తల్లి లక్ష్మమ్మ పిల్లలను పెంచుతూ చదివించింది. నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయాగా పనిచేస్తూ.. పిల్లలను చదివించి, ప్రయోజకుల్ని చేసింది. పెద్ద కుమారుడు శివప్రసాద్ తెల్కపల్లి మండలం గడ్డంపల్లిలో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తిస్తుండగా.. చిన్న కుమారుడు రాఘవేందర్ నాగర్‌కర్నూల్ ఎమ్మార్సీలో సీఆర్‌పీగా, కూతురు విద్యారాణి తెల్కపల్లిలోని బీసీ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ఐసీటీగా పనిచేస్తున్నారు. కుమారులు, కూతురు ప్రయోజకులైనప్పటికీ.. లక్ష్మమ్మ ఇంట్లో ఖాళీగా ఉండకుండా, ఓం మేకర్‌గా ఏదో ఒక పనిచేస్తూ, అందరి మన్ననలు పొందుతున్నారు.



కుటుంబ సభ్యులతో ఉన్న చెన్నోజు లక్ష్మమ్మ

# ఓటింగ్ శాతం పెంచుతాం

నాగర్‌కర్నూల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచుతామని నాగర్ కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి ఉదయ్ కుమార్ అన్నారు. గురువారం గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్రస్థాయి స్విప్ నోడల్ అధికారి భవానీ శంకర్ కలిసి స్విప్ కార్యక్రమాలపై జిల్లాస్థాయి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో 100% ఓటింగ్ సాధించడానికి భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ మరియు ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్విప్) కార్యకలాపాలను విరివిగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

# బీసీలకు సముచిత స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న నిరంజన్

నాగర్‌కర్నూల్‌రూరల్: అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు సముచిత స్థానం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 56 శాతం బీసీ జనాభా ఉందని పేర్కొన్నారు. మరో ఉప ముఖ్యమంత్రి పదవి బీసీలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, సదుర్ల తిరుపతయ్య, శ్రీనివాసులు, నిరంజన్‌యాదవ్, కొత్ర శ్రీనివాసులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### భక్తులు పోలీసులకు సహకరించాలి



మన్ననూర్: మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాలను సందర్శించుకునే భక్తులు శాంతి భద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. గురువారం మన్ననూర్‌లోని ఈగలపెంట పోలీస్ స్టేషన్‌లో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. శ్రీశైలం, భౌరాపూర్, ఉమామహేశ్వరం ఉత్సవాలకు 120 మంది బెటాలియన్ పోలీసులతో పాటూ 12 మంది ఎస్‌ఐలు, ఇద్దరు సీఐలతో పాటూ అమ్రాబాద్ సర్కిల్ పోలీసులతో గట్టి భద్రత చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, అచ్చంపేట సీఐ రవీందర్, ఎస్సైలు రమేష్ , రాములు, వీరమల్లు, వీరబాబు, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### 12న తైబజార్, పశువులు, మేకల సంత వేలం

అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈనెల 12న మంగళవారం తైబజార్, పశువులు, మేకలు, గొర్రెల సంత వేలం పాట నిర్వహించనున్నామని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కమిషనర్ శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తైబజార్ వేలం పాటలో పాల్గొనేవారు రూ. 3 లక్షలు, పశువులు, మేకలు, గొర్రెల సంత వేలం పాటలో పాల్గొనే వారు రూ. 10లక్షలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. ఈనెల 11న సోమవారం సాయంత్రం 5 గంటల వరకు డీడీ చెల్లించాలని కోరారు.

### 10 న హజ్ శిక్షణ శిబిరం

కందనూలు: జిల్లా కేంద్రంలోని రూబీ గార్డెన్‌లో ఈనెల 10న హజ్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ గురువారం జిల్లా సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



అమ్రాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



కోడేరులో..

అమ్రాబాద్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అదేవిధంగా పదరల విద్యాబాలస్ పాఠశాలలో ఉపాధ్యాయుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలకిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో 33 మంది విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో ఆకట్టుకున్నారు. హెచ్‌ఎం అర్జున్ బహుమతులు అందజేశారు.

ఉప్పునుంతల: మండలంలోని లత్తీపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు పాఠాలు బోధించారు. అధికారులుగా విధులు నిర్వర్తించి అందరిని ఆకట్టుకున్నారు. మాజీ సర్పంచు మల్లేష్ విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీలను అందజేశారు.

లింగాల: మండలంలోని కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు.

పెద్దకొత్తపల్లి: యాపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బిజినేపల్లి: మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు పాఠాలు బోధించారు.

వెల్దండ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాలతో పాటు, నారాయణపూర్‌లో పాఠశాలల్లో గురువారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో కలెక్టర్‌గా రంజిత్, డీఈఓగా భాను, ఎంఈఓగా భానుప్రశాంత్, హెచ్‌ఎంగా చరణ్‌తేజ్, హప్సా, పీఈటీలుగా భాను, జూబేర కొంత మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

### శివాలయాలు ముస్తాబు

లింగాల: మహా శివరాత్రి పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలను ముస్తాబు చేశారు. మండల కేంద్రానికి సమీపంలోని శివాలయం, అంబట్‌పల్లి శివాలయంలో శివపార్వతుల కల్యాణానికి ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

### ముగిసిన బ్రహ్మోత్సవాలు



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్ వెలసిన లక్ష్మీపద్మావతిసహిత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి గరుడ సేవతో ముగిసాయి. పట్టణ పురవీధుల గుండా గరుడ వాహనం ఊరేగింపు నిర్వహించారు. బుధవారం రాత్రి కల్యాణోత్సవానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని వివిధ పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. హరిశ్వరాదాండియా బృందం దాండియా ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం ఆలయంలో భక్తులకు దాతల సహకారంతో ఆలయ చైర్మన్ కల్వ మనోహర్ అన్నదానం చేశారు.

### కల్యాణం.. కమనీయం

తాడూరు: మండల కేంద్రంలోని శివాలయంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. శివస్వాములతోపాటు గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అంతకుముందు ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం, ప్రసాదం వితరణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూజారి జంగం శంకరయ్య, భక్తులు పాల్గొన్నారు.

### వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహాల ప్రతిష్ఠ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆర్యవైశ్యులు నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కన్యకాపరమేశ్వరి, శివపార్వతులు, సీతారాములు, నవగ్రహాలు, ఆంజనేయస్వామి విగ్రహాలను గురువారం వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య ప్రతిష్ఠించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏల్లేని సుధాకర్‌రావు, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, చంద్రమౌళి, శ్యాంసుందర్, శంకర్, రాజశేఖర్, స్వప్న, కిశోర్ పాల్గొన్నారు.

### ఘనంగా పల్లకీ సేవ



లింగాల: మండలంలోని కొత్తకుంటపల్లి సమీపంలోని నెల్లికొండపై వెలసిన భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి వార్లకు గురువారం బోనాల ఉత్సవాలను నిర్వహించారు. గురుస్వామి పర్వతాలు, మహిళలు పాల్గొన్నారు.

### నాగపడిగెల వితరణ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలో వెలసిన లలితా సోమేశ్వరస్వామి దేవాలయంలోని శివలింగాలకు హైదరాబాద్‌కు చెందిన రామిడి గాయత్రి,అశోక్ రెడ్డి, రామిడి వైష్ణవి, త్రిభువన్ రెడ్డి, సతీష్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డిలు రెండు నాగ పడిగెలను ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డికి అందజేశారు.

మైక్‌సెట్..

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి శివరామాంజనేయస్వామి దేవాలయానికి గ్రామానికి చెందిన రవి, యాదమ్మ దంపతులు మైక్‌సెట్‌ను అందించారు.

### ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ

బిజినేపల్లి: పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా తిమ్మాజీపేట మండల కేంద్రం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను ఆర్డీఓ కే.సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఇంగ్లీషు ఆర్టికల్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఓటరు లిస్టును పరిశీలించారు. రెండు ఓట్ల గుర్తింపు, చనిపోయిన వారి ఓట్లు గుర్తించి తొలగించాలని సూచించారు. తహసీల్దారు జేకే మోహన్, అధికారులు పాల్గొన్నారు.

### అడవి జంతువుల దాడిలో దూడ మృతి

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన రైతు చిమ్ముల రవీందర్‌రెడ్డి సంబంధించిన గేదె దూడపై బుధవారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువులు దాడి చేయడంతో దూడ మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం పశువుల షెడ్‌లో గేదె, దూడలను కట్టేశాడు. గురువారం ఉదయం రైతు పశువుల షెడ్‌కి వెళ్లి చూడగా దూడపై గుర్తు తెలియని జంతువులు దాడి చేసినట్లు గుర్తించారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించడంతో ఘటన స్థలాన్ని బీట్ ఆఫీసర్ లలిత పరిశీలించారు. అక్కడ లభించిన ఆధారాలతో హైనా దాడిచేసి ఉండొచ్చని భావిస్తున్నారు. దూడకు పోస్టుమార్టం నిర్వహించారు.

### బియ్యం అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేటకు చెందిన లలిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయిటి ఆశాదీప్‌రెడ్డి బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, నగదును సమకూర్చారు. ఈ మేరకు గ్రామస్తులు బుచ్చయ్య, కిష్టయ్య బాధిత కుటుంబసభ్యులకు గురువారం అందజేశారు. రాజు, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### కలిసికట్టుగా పనిచేయాలి



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో బీఎస్పీ కార్యకర్త కారంగి బ్రహ్మయ్య నివాసంలో గురువారం రాత్రి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ మద్దతు ఇచ్చే అభ్యర్థిని కలిసికట్టుగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, రాజు, కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

### ఈ-పాస్ మిషన్ తప్పనిసరి

బిజినేపల్లి: వ్యవసాయ దుకాణాల్లో ఎరువుల కోసం వచ్చే రైతులకు ఈ-పాస్ మిషన్ ద్వారా పంపిణీ చేయాలని తిమ్మాజిపేట మండల వ్యవసాయాధికారి కమల్‌కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పలు వ్యవసాయ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ-పాస్ మిషన్‌లో ఎరువులు నమోదు చేయకుండ అమ్మితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

అచ్చంపేట రూరల్: ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని ఆర్డీఓ మాధవి అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో స్విప్ కార్యక్రమంలో భాగంగా పట్టణ, గ్రామీణ మహిళా సంఘాల సభ్యులు, రెవెన్యూ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలకు బహుమతులు అందజేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ మురళీమోహన్, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, ఏపీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

### భౌరాపూర్‌లో ఏర్పాట్లు పరిశీలన

లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతం అప్పాపూర్‌పెంట గ్రామ పంచాయతీ పరిధిలోని భౌరాపూర్‌లో చెంచుల జాతర ఏర్పాట్లను గురువారం అధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ కర్ణనాయక్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, జైపాల్, రాజేష్‌రెడ్డి, సురేష్, చంద్రయ్య భౌరాపూర్‌లో ఉంటూ పారిశుద్ధ్య పనులు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం చెంచుల ఆధ్వర్యంలో జరిగే మల్లికార్జున, భ్రమరాంబిక కల్యాణం తిలకించడానికి నియోజకవర్గంలోని పలు పెంటల నుంచి వచ్చే చెంచులు, ఇతరులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి ఆర్టీసీ వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల ద్వారా జాతరకు చెంచులు తరలివెళ్లారు.

### తరలిన చెంచులు

మన్ననూర్: మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా చెంచులు ప్రతి ఏట నల్లమల అటవీ సరిహద్దు ప్రాంతం భౌరాపూర్ చెరువు ప్రాంతంలో నిర్వహించే ఉత్సవాలకు చెంచులు తరలివెళ్లారు. మన్ననూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి 11 బస్సులను కేటాయించింది. ఈ క్రమంలో గురువారం ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న చెంచు గ్రామాలు, గూడాలు, పెంటల నుంచి చెంచులు బస్సులల్లో భౌరాపూర్‌కు తరలివెళ్లారు. రాత్రికి స్వామి వార్ల కల్యాణ కార్యక్రమంలో భాగంగా భ్రమరాంబికా దేవికి నాగెల్లి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

### రెగ్యులరైజ్ చేయాలని ధర్నా



నాగర్‌కర్నూల్‌రూరల్: నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట సెకండ్ ఏఎన్‌ఎంలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంహెచ్‌ఓ ఇన్‌చార్జ్ రవికుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. కేంద్రప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు. గతంలో ఏఎన్‌ఎంలు సమ్మె చేసినప్పుడు ప్రభుత్వం కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఫర్వీనా, నాయకురాలు హిమబిందు, పద్మ, భాగ్యమ్మ, పార్వతి, రాజేశ్వరి, ఇందిర, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

### వేప కషాయాలపై అవగాహన

తెలకపల్లి: మండలంలోని పర్వతాపూర్‌ను పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయ రావేఫ్ విద్యార్థులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వేప ఆకుల కషాయం తయారీ విధానం అవగాహన కల్పించారు. పంటల అధిక దిగుబడిపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రావేప్ విద్యార్థులు విశ్వతేజ, అనూష, శ్వేత, సుభద్ర, ద్వారకమహి, రైతులు సైదులు, తిరుపతిరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

